రవీంద్రభారతిలో నిర్వహించిన బీసీల సమరభేరి మహాసభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఆర్ కృష్ణయ్య, వీ శ్రీనివాస్‌గౌడ్, వీ హన్మంతరావు, వివిధ సంఘాల నేతలు

జనగణనలో కులగణన చేపట్టాలి

- పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి
- రిజర్వేషన్లు 50% పెంచాలి
- బడ్జెట్‌లో 2 లక్షల కోట్లు ఇవ్వాలి
- బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయాలి
- బీసీ సమరభేరీలో ఆర్ కృష్ణయ్య

రవీంద్రభారతి, నవంబర్ 25: కేంద్ర ప్రభుత్వం 2025లో చేపట్టబోయే జనగణనలో కులగణన కూడా చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశ పెట్టి చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన బీసీల సమరభేరీ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను 27% నుంచి 50 శాతానికి పెంచాలని, బడ్జెట్‌లో బీసీలకు రూ.2 లక్షల కోట్ల కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ షరతులను వెంటనే ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తాచాటాలని పిలుపునిచ్చారు. జనాభాలో 56% ఉన్న బీసీలకు చట్టసభలో రిజర్వేషన్లు ఇవాల్సిందేనని, లేదంటే దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలతో కలిసి అగ్గి రాజేస్తామని హెచ్చరించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ అట్రాసిటీ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ తక్షణమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై పునః పరిశీలించి, వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తూతూమంత్రంగా కులగణన: శ్రీనివాస్‌గౌడ్

కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణలో చేపట్టిన కులగణనను తూతూ మంత్రంగా చేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజరేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతమంది బీసీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇచ్చారని ప్రశ్నించారు. కులగణన సర్వేలో కూడా కుట్రలు, కుతంత్రాలు చేసి బీసీల సంఖ్యను తక్కువ చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వీహెచ్ హన్మంతరావు, ఎమ్మెల్సీ కోదండరాం, ఎంఐఎం ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ నేతలు నీల వెంకటేశ్ , ఆళ్ల రామకృష్ణ, అంజి, సీ రాజేందర్, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై బీసీల్లో అనుమానాలు

- వాటిని నివృత్తి చేసే బాధ్యత ప్రభుత్వానిదే
- డెడికేటెడ్ కమిషన్‌ను స్వతంత్రంగా పనిచేయనివ్వండి
- కాంగ్రెస్‌కు 55 ఏండ్ల తర్వాత కులగణన గుర్తొచ్చిందా
- బీజేపీ డీఎన్ఏలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీలపై వ్యతిరేకత
- ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- డెడికేటెడ్ కమిషన్‌కు సలహాలు, సూచనలతో నివేదిక

బీసీ రిజర్వేషన్లు, కులగణనపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రూపొందించిన నివేదికను బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు అందజేస్తున్న ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నవంబర్25 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ, కులగణన కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం స్వతంత్రంగా పని చేయనివ్వాలని, కమిషన్‌కు వసతులు కల్పించాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కులగణనపై బీసీ వర్గాల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వాటిని ప్రభుత్వం నివృత్తి చేయాలని కోరారు. 55 ఏండ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, ఇప్పటి వరకు కులగణన ఎందుకు చేపట్టలేదో రాహుల్‌గాంధీ చెప్పాలని నిలదీశారు. కర్నాటకలో చేపట్టిన కులగణన వివరాలను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు, కులగణనకు సంబంధించిన అంశాలపై సలహాలు, సూచనలు చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రూపొందించిన నివేదికను డెడికేటెడ్ కమిషన్‌కు సోమవారం అందజేశారు. బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆమె మాసబ్‌ట్యాంక్‌లోని కమిషన్ కార్యాలయానికి వెళ్లి చైర్మన్ బీ వెంకటేశ్వరరావును కలిసి నివేదిక ప్రతిని అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో అన్ని కులాలు అభివృద్ధి చెందాలని ప్రభుత్వాలు అనేక నిర్ణయాలు తీసుకున్నా జరగాల్సిన న్యాయం జరగలేదన్న ఆవేదన, రాజ్యాంగపరమైన హక్కులు కల్పించలేదన్న భావన బీసీవర్గాల్లో తీవ్రంగా ఉన్నదని తెలిపారు. ప్రాంతీయ పార్టీల హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని గుర్తుచేశారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలపై బీజేపీకి వ్యతిరేకత

కులగణన చేపట్టబోమని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో 2021లో అఫిడవిట్ దాఖలు చేసిందని, బీజేపీ డీఎన్ఏలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీలపై వ్యతిరేక భావాలున్నాయని ఎమ్మెల్సీ కవిత నిప్పులు చెరిగారు. ఇక బీసీలకు న్యాయం చేస్తామని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని, ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో లక్ష కోట్లు ఖర్చు చేస్తామని అనేక హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. కులగణన, రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, అనేక బీసీ సంఘాలు ఉద్యమిస్తే అప్పటికే 11 నెలల తర్వాత హైకోర్టు అక్షింతలు వేశాక డెడికేటెడ్ కమిషన్‌ను కాంగ్రెస్ ఏర్పాటు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్‌ను ఏర్పాటు చేసినా కార్యాలయంలో కూర్చుందామంటే కుర్చీ లేదని, రాద్దామంటే పెన్నూ లేదని, అలాంటి పరిస్థితుల్లో నెల రోజుల్లోనే అంతపెద్ద అంశంపై నివేదికనివ్వాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తే ఎలా సాధ్యమవుతుందని నిలదీశారు. కేవలం రాజకీయ రిజర్వేషన్లకే పరిమితం కాకుండా బీసీలకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లను నిలదీసి హక్కులు సాధించుకునే ప్రయత్నం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అనుమానాలను నివృత్తి చేయాలి..

ఓ వైపు ప్రణాళికశాఖ ద్వారా ఇంటింటి సర్వేను చేయిస్తున్నదని, మరోవైపు బీసీ శాఖ బీసీల వివరాలు సేకరిస్తున్నదని, ఆ సమాచారాన్నే డెడికేటెడ్ కమిషన్ వాడుకోవాలని ప్రభుత్వం చెప్తున్నదని, అయితే బీసీలకు రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు కోర్టులో కేసులు వేస్తే అది చట్టం ముందు సర్వే నివేదిక నిలబడుతుందా? లేదా అన్నది ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. దానిపై బీసీలకు రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ స్టిక్కర్లు వేయని ఇండ్లు 70 శాతం ఉన్నాయని, అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి వంటి జిల్లాల్లో సర్వే పూర్తి కాకుండానే రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం సర్వే పూర్తయిందని ప్రభుత్వం ఎలా చెప్తున్నదని ప్రశ్నించారు. సర్వే వివరాల కంప్యూటరైజేషన్ 7 శాతం కూడా పూర్తి కాలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ బీసీ నాయకులు వీ ప్రకాశ్, రవీందర్‌సింగ్, జూలూరి గౌరీశంకర్, పల్లె రవికుమార్‌గౌడ్, సుమిత్ర ఆనంద్, రాజీవ్‌సాగర్, మఠం భిక్షపతి , ఉపేంద్రాచారి, కిశోర్‌గౌడ్, శుభప్రద్ పటేల్, రామ్ బాబుయాదవ్, రూప్‌సింగ్, రవీందర్‌యాదవ్, మహేశ్‌యాదవ్, నారాయణ, నరహరి, నిమ్మల వీరన్న, మారయ్య, ఇంతియాజ్, పావనిగౌడ్, ఓదెల్ల మాధవ్, గీత గౌడ్, మాధవి, మేఘన, జాగృతి రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి, అర్చన సేనాపతి, వర లక్ష్మి మంచాల, లలిత యాదవ్, ఈగ సంతోష్, నరేంద్ర యాదవ్, శ్రీనివాస్ పుట్టి, యునైటెడ్ పులే ఫ్రంట్ నాయకులు గట్టు రామచంద్రం, బొల్ల శివశంకర్, రాజారాం యాదవ్, ఆలకుంట్ల హరి, దత్తాత్రేయ, నరేశ్ ఎమ్మెస్ నరహరి, అంబటి సుధాకర్, కుమారస్వామి, ప్రవీణ్, గోపు సదానందం, నాయిని నరేందర్, మధు, సుంకోజు కృష్ణమాచారి, విజయేందర్, సాగర్, సురేశ్, నిమ్మల వీరన్న, మాడెపు అనిల్, లింగం, జంగయ్య పాల్గొన్నారు.

నివేదికలోని ముఖ్య డిమాండ్లు..

- తెలంగాణలో కులగణనను శాస్త్రీయంగా నిర్వహించాలి. జాతీయ స్థాయి జనాభా గణనలో కులగణన కూడా చేపట్టేలా సిఫారసు చేయాలి.
- బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించడంతోపాటు, విద్య, ఉద్యోగావకాశాల్లో ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లను కూడా పెంచేందుకు సిఫారసు చేయాలి.
- చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్లు అమలు జరిపేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదించాలి.
- బీసీ సబ్‌ప్లాన్ అమలు జరిపేలా ప్రభుత్వాలకు కమిషన్ సిఫారసు చేయాలి.
- కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఉండేలా కేంద్ర ప్రభుత్వానికి కమిషన్ సూచించాలి.
- ఎంబీసీ, సంచార జాతుల వారి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు జరిపేలా, ఎంబీసీల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక చర్యలు తీసుకునేలా, ప్రస్తుత ఎంబీసీ కార్పొరేషన్‌కు అవసరమైన నిధులు కేటాయించేలా, సంచార జాతుల వారికి స్థిర నివాసాలు, ఉపాధికి చర్యలు చేపట్టేలా, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిరాటంకంగా అందించేలా, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే బీసీ విద్యార్థులకు ఆర్థిక సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ సిఫారసు చేయాలి.
- ఇప్పటికీ ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో కనీస ప్రాతినిధ్యం దక్కని కులాలకు వారి జనాభా దామాషాను అనుసరించి, ఆయా ఫలాలు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా కమిషన్ సూచించాలి.
- స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపునకు దోహదపడేలా డెడికేటెడ్ కమిషన్ నివేదిక రూపొందించాలి.

బీసీ కులాల పునర్‌వ్యవస్థీకరణ ?

- సర్వే నివేదిక వచ్చాక ప్రతిపాదనలు రూపొందిస్తాం
- ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లపైనా అభ్యంతరాలు ఉన్నాయి
- ఇప్పటివరకు 1224 విజ్ఞప్తులు
- నేడు కూడా బహిరంగ విచారణ
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని బీసీ ఏ, బీ, సీ, డీ, ఈ లోని కులాలను పునర్‌వ్యవస్థీకరించాలని అనేక కుల సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయని, ఇంటింటి సర్వే నివేదిక వచ్చిన తర్వాత ఆ దిశగా కృషి చేస్తామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ వెల్లడించారు. అదీగాక ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీ వర్గాలకు నష్టం వాటిల్లుతున్నదనే ఆధారాలను పలు సంఘాలు చూపుతున్నాయని, దీనిపైనా సానుకూల దృక్పథంతో దృష్టి సారిస్తామని తెలిపారు. ఉమ్మడి పదిజిల్లాల్లో తెలంగాణ బీసీ కమిషన్ చేపట్టిన బహిరంగ విచారణ ఇటీవలే ముగియగా, దానికి కొనసాగింపుగా ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి బహిరంగ విచారణను సోమవారం నిర్వహించారు. ప్రజలు, వివిధ కుల సంఘాల నుంచి దరఖాస్తులను అభ్యర్థనలను స్వీకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ ఒక్క రోజే దాదాపు 58 వినతులు, సలహాలు, సూచనలు అఫిడవిట్ రూపంలో కమిషన్‌కి అందాయని వెల్లడించారు. బహిరంగ విచారణలో మొత్తంగా 1224 వినతులను స్వీకరించామని తెలిపారు. బీసీ జాబితాలో నుంచి తొలగించిన 26కులాలను తిరిగి చేర్చాలని కోరారని తెలిపారు. ఇంకా వినతులను సమర్పించాలనుకున్న వారు మంగళవారం కమిషన్‌లో జరిగే బహిరంగ విచారణలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో చైర్మన్ నిరంజన్‌తోపాటు, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్ , బాలలక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు విశ్వవిద్యాలయాలకు వెన్నెముక

తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): యూనివర్సిటీలకు పరిశోధనలే వెన్నెముకలని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ దండ అంజిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ద్వైమాసిక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. స్టార్టప్‌లు ప్రారంభించేలా ప్రోత్సహించి విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలకు సూచించారు. రీసెర్చ్ స్కాలర్లు ఉద్యాన పంటలపై అధునాతన పరిశోధనలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభావవంతమైన ఫలితాల కోసం శాస్త్రవేత్తలు పనిచేయాలని చెప్పారు. సమావేశంలో యూనివర్సిటీ అధికారులు, అసోసియేట్ డీన్స్ పాల్గొన్నారు.

కలెక్టరమ్మా మమ్మల్ని ఆదుకో..

కలెక్టరేట్‌లో గోడు వెల్లబోసుకున్న దివ్యాంగ వృద్ధురాలు

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 25: కూలినాలీ చేసి ఇల్లు కొనుక్కుంటే.. ఓ మాజీ పోలీస్ అధికారి దొంగ కాగితాలు తెచ్చి బెదిరిస్తున్నాడు..కలెక్టరమ్మా మమ్మల్ని నువ్వే కాపాడాలని ఓ దివ్యాంగ వృద్ధురాలు కలెక్టర్‌ను వేడుకున్నది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన దివ్యాంగ వృద్ధురాలు కాటిపల్లి లక్ష్మి సోమవారం కలెక్టరేట్‌లో 2గంటలు వేచిఉన్నది. గమనించిన కలెక్టర్ పమేలా సత్పతి వృద్ధురాలిని మందలించింది. నోటమాట రాక వృద్ధురాలు సైగల ద్వారా తన ఆవేదనను వెలిబుచ్చింది. పక్కనే ఉన్న కుమారుడు, కోడళ్లను అడగడంతో వారు కలెక్టర్‌కు వివరాలు వెల్లడించారు. జమ్మికుంటలోని 465/బీ/4 సర్వే నంబర్‌లో తమకున్న 6 గుంటల భూమి మాజీ పోలీస్ అధికారి ఏనుగు జయపాల్‌రెడ్డి తనపేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు తెలిపారు. పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించగా, తాము నాలుగుసార్లు ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారి దృష్టికి చేరనీయడంలేదని వాపోయారు. దీంతో తాను ప్రత్యేకంగా పోలీస్ అధికారితో మాట్లాడి, చర్యలు తీసుకుంటానని కలెక్టర్‌కు వారికి భరోసానిచ్చారు.

పొదుపు సరే..దుబారా సంగతేంటి?

- ఆఫీసు ఖర్చు తగ్గించేలా సీఎస్ ఉత్తర్వులు
- అధికారుల విదేశీ టూర్లు వద్దని స్పష్టీకరణ
- ఆఫీసర్ల వాహనాల కొనుగోళ్లపైనా నిషేధం
- ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ చార్జింగ్ తగ్గించాలి
- సీఎస్ ఆదేశాలపై ఉద్యోగుల తీవ్ర విస్మయం
- సీఎం, మంత్రుల వీదేశీ పర్యటనలపై ప్రశ్నలు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం దారుణంగా పడిపోయింది. నెలవారీ నిర్వహణ కూడా భారంగానే నడుస్తున్నది. ఇదే సమయంలో ప్రభుత్వం ఖర్చును తగ్గించుకోవడంపై దృష్టి సారించినట్టు కనిపిస్తున్నది. సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ ఖర్చులు కూడా తగ్గించుకోవడం ద్వారా పైసలు ఆదా చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందుకోసం పొదుపు మంత్రం పాటిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రభుత్వ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏయే విధంగా ఖర్చు తగ్గించుకోవాలో వివరంగా సూచించారు. ఇప్పుడు అధికారులు, ఉద్యోగుల్లో సీఎస్ ఉత్తర్వులపై తీవ్రమైన చర్చ జరుగుతున్నది.

కరెంటు ఖర్చు తగ్గించండి

ఆఫీసులలో విద్యుత్ వాడకంలోనూ పొదుపు మంత్రం పాటించాలని సీఎస్ సూచించారు. ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లను అవసరం ఉన్నప్పుడు మాత్రమే వాడాలన్నారు. వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాల వాడకాన్ని కూడా తగ్గించాలని, అవసరం లేనప్పుడు వెంటనే చార్జింగ్ తీసేయాలని సూచించారు. సీఎస్ ఆదేశాలపై అధికారులు, ఉద్యోగులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్లు, ఇయర్ బడ్స్ చార్జింగ్ కూడా వృథా కిందకే వస్తుందా అని అంటున్నారు. తామేదో వృథా ఖర్చులు చేస్తున్నట్టుగా సీఎస్ ఉత్తర్వులు ఉన్నాయని అభ్యంతరం తెలుపుతున్నారు.

ఇదెక్కడి చోద్యం..?

ప్రభుత్వం చెబుతున్న పొదుపు మంచిదే అయినా రాబడిపై దృష్టి పెట్టకుండా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడం అసాధ్యమని అధికారులు చెబుతున్నారు. పొదుపు మంత్రం అధికారులు, ఉద్యోగులకేనా? మంత్రులకు కూడా వర్తిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఐదు దేశాల్లో పర్యటించారని, మరోసారి అమెరికా ప్రయాణానికి సిద్ధమవుతున్నారని గుర్తుచేస్తున్నారు. మంత్రులు నెలకొకరు విదేశాలకు వెళ్లి వస్తున్నారని చెప్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ విదేశీ టూర్లకు వెళ్లారని, పొదుపు పాటించడంతో పాటు దుబారా అరికట్టేందుకు కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సీఎస్ పొదుపు మంత్రం

అధికారులు పాటించాల్సిన పొదుపు సూచనలతో సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు స్టడీ టూర్లు, సెమినార్లు, వర్క్‌షాప్‌ల పేరుతో విదేశాలకు వెళ్లొద్దని తేల్చిచెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే, అతితక్కువ మందితో, తక్కువ ఖర్చుతో ప్రయాణాలు చేయాలని సూచించారు. కార్యాలయాలు, అధికారిక నివాసాల్లో సౌకర్యాలు, వసతుల్లోనూ పొదుపు పాటించాలని పేర్కొన్నారు. వాహనాల కొనుగోళ్లపైనా నిషేధం విధించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిషేధం కొనసాగుతుందని స్పష్టంచేశారు.

సమగ్ర కుటుంబ సర్వేపై గతంలో రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోను ఎన్యూమరేటర్లకు వినిపిస్తున్న మాజీ మంత్రి వేముల

నాడు వద్దన్న సర్వే ఇప్పుడెందుకు?

రేవంత్ తీరుపై మాజీ మంత్రి వేముల ఆగ్రహం

వేల్పూర్, నవంబర్ 25 : కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను నాడు వద్దన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సర్వే ఎలా చేయిస్తారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని తన నివాసానికి సోమవారం సర్వే కోసం వచ్చిన ఎన్యూమరేటర్లతో ఆయన మాట్లాడారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేను వ్యతిరేకిస్తూ మాట్లాడిన వీడియోను ఈ సందర్భంగా వారికి చూపించారు. నాడు సర్వే వద్దని మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎలా సర్వే చేపడుతున్నారని ప్రశ్నించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన గోప్యత హక్కులకు విరుద్ధంగా ఆస్తులు, అంతస్తులు, వాహనాలు తదితర స్థిర, చరాస్తుల వివరాలు ఎలా సేకరిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. తనకు వివరాలు ఇవ్వటానికి అభ్యంతరం లేదని, కానీ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేను తప్పు అంటూ వివరాలు సేకరించటానికి అడ్డమైన వాళ్లను ఇంటికి పంపిస్తారంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పిన తర్వాతే వ్యక్తిగత వివరాలు సేకరించాలని ఎమ్మెల్యే వేముల డిమాండ్ చేశారు. గడువులోగా పూర్తి చేయాలనే ఆతృతతో సర్వే చేస్తే తప్పులు దొర్లే ప్రమాదం ఉన్నదని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు మైనార్టీలు, అగ్రవర్ణాల పేదలకు కూడా సర్వే ద్వారా సరైన న్యాయం దక్కేలా వివరాలు నమోదు చేయాలని సూచించారు. సర్వే పేరిట టీవీ, ఫ్రిడ్జ్, స్కూటర్ లాంటి సాధారణ అంశాలను పరిగణనలోకి తీసుకుని సంక్షేమ పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని వేముల హెచ్చరించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న కళాకారులను అడ్డుకుంటున్న స్థానికులు

ఆరు గ్యారెంటీలు ఎక్కడ?

- ప్రభుత్వ పథకాలపై ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్థులు
- పెద్దలింగాపూర్ నుంచి వెనుదిగిరిన కళాకారులు

ఇల్లంతకుంట, నవంబర్ 25 : 'కాంగ్రెస్ సర్కార్ ఇస్తామన్న ఆరు గ్యారెంటీలు ఎక్కడ అమలైనయ్? అమలు కాకపోయినా అయినట్టు ఎందుకు ప్రచారం చేస్తున్నరు?' అంటూ తెలంగాణ సాంస్కృతిక కళాకారులను రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ వాసులు ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం కళాకారులు గ్రామానికి వచ్చి ప్రచారం చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. అమలు కాని పథకాలను అమలైనట్టు చెప్పడం ఎమిటని నిలదీశారు. ఉచిత బస్సు ఎవరు అడిగారని ఇచ్చారు? అవి సమయానికి రావడం లేదని ఆరోపించారు. రూ.500 సిలిండర్ అమలు చేశామని ఎందుకు పాటలు పాడుతున్నారు? ఎక్కడ అమలు జరిగిందో, ఎవరికి వచ్చిందో చూపిస్తారా? అని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఎక్కడ ఇస్తున్నారని అడిగారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని కనీసం కొనకపోవడంతో దళారులకు విక్రయించుకునే పరిస్థితి తీసుకువచ్చిందని మండిపడటంతో కళాకారులు వెనుదిరిగారు.

మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి మృతి

మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి (ఫైల్)

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 25 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మిత్రుడు, దొమ్మాట మాజీ ఎమ్మెల్యే (ప్రస్తుతం దుబ్బాక నియోజకవర్గం) దొమ్మాట రామచంద్రారెడ్డి (85) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో మృతి చెందాడు. ఆయన స్వగ్రామం సిద్దిపేట జిల్లా కొండపాక. ఆయనకు భార్య అనంతలక్ష్మిలో పాటు ఇద్దరు కూతుళ్లు సీత, గీత ఉన్నారు.

కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు

నేవీలో ఉద్యోగం చేసిన రామచంద్రారెడ్డి టీడీపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. కేసీఆర్ 1985లో సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు దొమ్మాట నుంచి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది రెండు నియోజకవర్గాల్లో టీడీపీని బలోపేతం చేశారు. నాలుగున్నర సంవత్సరాలు తెలుగుదేశం ఎమ్మెల్యేగా పనిచేసిన రామచంద్రారెడ్డి ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప